సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం ￨ 18 ￨ అక్టోబర్ ￨ 2023



సేల్స్‌ట్యాక్స్ అధికారుల దాడులు

జమ్మలమడుగు పట్టణంలో వస్త్ర దుకాణంపై 20 మంది సేల్స్ ట్యాక్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. -IIలో



చిత్తూరు జట్టు విజయం

కడప నగరంలో జరిగిన ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు విజయం సాధించింది. -IIలో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.8/24.2

జిల్లాలో మంగళవారం 24.2 - 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలిలో తేమ మధ్యాహ్నం 53 శాతం మధ్య నమోదైంది. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఎర్త్ సైన్స్ కోర్సులో అడ్మిషన్లు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా అర్హత పత్రాలతో నేరుగా వైవీయూ ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 89855 97928 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మెరిట్ జాబితా విడుదల

కడప రూరల్ : కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకాలకు సంబంధించి అభ్యర్థుల తుది ఫైనల్ మెరిట్ జాబితా పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్టాఫ్ నర్స్ నియామకాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 1278 మందితో ఫైనల్ జాబితా సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలు కడప.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు చూసుకోవచ్చునన్నారు. జాబితాను కార్యాలయంలోని నోటీస్ బోర్డులోనూ పొందుపరిచామని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ గోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా ఏపీఎస్‌బీసీఎల్(ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్) డిపో మేనేజర్‌గా కేపీ.గోపాల్ మంగళవారం డిపో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లాలో ఎస్ఈబీ సూపరింటిండెంట్‌గా పని చేస్తున్న ఈయన కడప జిల్లా డిపో మేనేజర్‌గా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సిబ్బంది పనితీరును మెరుగుపరుస్తామన్నారు.

పదోన్నతులకు పచ్చజెండా

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల పదోన్నతుల ప్రక్రియకు పచ్చజెండా ఊపారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్)లో భాగంగా పదోన్నతులు నిర్వహించేందుకు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య మంగళవారం నోటిఫికేషన్ జారీచేశారు. విశ్వ విద్యాలయంలో ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫసర్లుగా, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించనున్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అధ్యాపకులు తదుపరి గ్రేడ్/పదోన్నతి పొందేందుకు అర్హులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైవీయూ.ఈడీయూ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను నవంబర్ 30వ తేదీ లోపు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.


ఆరోగ్యానికి భరోసా

కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా ఇచ్చింది. ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి ఉచిత సేవలు పొందుతున్నారు. మంగళ వారం జిల్లా వ్యాప్తంగా 27 కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు జరిగాయి కడప నగరం అక్కాయపల్లెలో అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొన్నారు. ఎర్రగుంట్ల మండలం తుమ్మరపల్లెలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి మిగిలిన ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన దీపిక.. సృజనకు వేదిక

చిన్నతనం నుంచే ఏదో సాధించాలనే లక్ష్యంతో మెలిగే చిన్నారులను భావి శాస్త్రవేత్తలుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. నిర్దిష్ట సమస్యలపై శాస్త్రీయ పరిశోధనలు చేపట్టేలా విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించేందుకు జాతీయ సైన్సు కాంగ్రెస్ ఏటా అక్టోబరులో నిర్వహిస్తోంది. నిత్యజీవితంలో విజ్ఞాన శాస్త్రాన్ని అనుసంధానం చేస్తూ క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు శాస్త్రీయంగా ఆలోచించడం, కారణాలను అన్వేషించడంపై వారితో నమూనాలు తయారుచేయించి ప్రదర్శించేలా ప్రోత్సహిస్తోంది.

- సైన్సుపై ఆసక్తి పెంచే దిశగా అడుగులు
- నెలాఖరులో జిల్లా స్థాయి సైన్సు కాంగ్రెస్
- విద్యార్థుల ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రోత్సాహం



గత ఏడాది జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న పర్యాటకశాఖ మంత్రి రోజా (ఫైల్)

కడప ఎడ్యుకేషన్ : బాల సైంటిస్టులు చేసే ప్రాజెక్టు ప్రదర్శనలకు జాతీయ సైన్సు కాంగ్రెస్ వేదిక కాబోతోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరున జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన జరగనుంది. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత, అన్ని యాజమాన్య పాఠశాలల పరిధిలో 6 నుంచి 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ పోటీల్లో ప్రాజెక్టులు ప్రదర్శించేందుకు అర్హులు. 10-17 ఏళ్ల లోపు వయస్సు వారంతా జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొనవచ్చు. వీరు ప్రదర్శించిన ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపుతారు. అక్కడ 10-14 ఏళ్ల లోపు వారిని జూనియర్లుగా, 14-17 ఏళ్ల వారిని సీనియర్లుగా పరిగణించి వారిలో ఉత్తమ ప్రదర్శనలను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అనంతరం ఎంపికైన వారికి నగదు ప్రోత్సాహంతోపాటు పేటెంట్ హక్కులను కల్పిస్తారు.

ప్రాజెక్టుల్లో చేయాల్సిన అంశాలు..

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, సృజనాత్మకతను ప్రోత్సహించేలా 2023-24 సంవత్సరానికి సంబంధించి జాతీయ సైన్సు కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు ఈ నెలాఖరున నిర్వహించనున్నారు. పర్యావరణ వ్యవస్థను ప్రధాన అంశంగా చేర్చారు. ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, పర్యావరణ వ్యవస్థ ఆధారిత జీవనం విధానం, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణ అంశాల్లో మాత్రమే ప్రాజెక్టులు రూపొందించాల్సి ఉంటుంది.

రూపకల్పన ఎలా..

పాఠశాల స్థాయి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,654	68,608
ప్రాథమికోన్నత	135	40,786
హైస్కూల్	255	27,050

జిల్లా బాలల సైన్సు కాంగ్రెస్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులు సైన్సు సూత్రాలను ప్రదర్శించే నమూనా ఉండాలి. ప్రధాన అంశానికి లేదా ఉప అంశానికి లోబడే ఉండాలి. సమస్యకు సకాలంలో పరిష్కారాన్ని కనుగొనే నిర్దిష్ట అధ్యయన పద్ధతిలో శాస్త్రీయంగా ఉండాలి. ఇద్దరు విద్యార్థులు ఒక జట్టుగా ఏర్పడి ప్రాజెక్టు నిర్వహించాలి. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఒక ప్రాజెక్టు తప్పని సరిగా ఉండాలి. ప్రాజెక్టు రిపోర్ట్, లాగ్‌బుక్, నాలుగు చార్ట్‌లు తప్పనిసరిగా ప్రెజెంటేషన్ సమయంలో సమర్పించాల్సి ఉంటుంది ప్రెజెంటేషన్ 6 నిమిషాలు, వైవా 2 నిమిషాలు ఉంటుంది. వాటిలో అత్యుత్తమమైన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఆ తర్వాత జాతీయ స్థాయికి ఎంపికవుతాయి.


భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలనే..



తన చుట్టూ ఉన్న ప్రకృతి వనరులను, వాతావరణాన్ని, వాటి వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను అర్థం చేసుకుని విశ్లేషించుకుని పరిష్కార మార్గాలను అన్వేషించే బహత్తరమైన కార్యక్రమం. ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేట్టు చేయాలి.

- శ్రీనివాసులురెడ్డి, బాలల సైన్సు కాంగ్రెస్, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్

పరిశోధనలు ఉత్తమైనవిగా ఉండాలి..



బాలలు పరిశోధనలు చేసే దిశగా సమాయత్తం చేయడమే సైన్సు కాంగ్రెస్ లక్ష్యం. ప్రజా సమస్యలను పరిష్కారం చూపే విధంగా పరిశోధనలుండాలి. శాస్త్రీయంగా పరిశోధనలు చేసి వాటి ప్రెజెంటేషన్ చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులంతా తమ విద్యార్థులను సమాయత్తం చేయాలి.

- డీవీ.సుబ్బానాయుడు, బాలల సైన్సు కాంగ్రెస్, జిల్లా కో ఆర్డినేటర్

బాలలను సన్నద్ధం చేయాలి..



ప్రధానోపాధ్యాయులంతా బాలల సైన్సు కాంగ్రెస్‌కు పిల్లలను సన్నద్ధం చేయాలి. ప్రతి పాఠశాల నుంచి సైన్సు కాంగ్రెస్‌లో పాల్గొనేలా చూడాలి. ఇందుకు విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. జాతీయ స్థాయి బాలల సైన్సు కాంగ్రెస్‌లో జిల్లాకు మంచిపేరు తేవాలి.

- ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

ఆర్ట్స్ కళాశాలకు స్టార్ హోదా

- ఏపీ నుంచి స్టార్ కళాశాల ప్రోగ్రాంకు ఎంపిక
- డీబీటీ నుంచి రూ.1 కోటి నిధులు మంజూరు



కడప ప్రభుత్వ పురుషుల కళాశాల

వైవీయూ : భారత సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని న్యూఢిల్లీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ) ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన 'స్టార్ కాలేజ్' ప్రోగ్రాంకు కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా స్వయం ప్రతిపత్తి కలిగిన ఏడు కళాశాలలు దరఖాస్తు చేసుకోగా.. ఈ ప్రోగ్రాంకు ఆర్ట్స్ కళాశాల ఎంపికైంది. ఈ ఏడాది జూలై 13, 14వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వై.సావిత్రిల బృందం ఇచ్చిన ప్రెజెంటేషన్ వారికి నచ్చడంతో నిధులు విడుదలకు ఆమోదం తెలిపారు. తాజాగా విడుదల చేసిన జాబితాలో ఈ ప్రోగ్రాం కింద ఏపీ నుంచి కడప ఆర్ట్స్ కళాశాలకు మాత్రమే అవకాశం దక్కింది.

1948 నుంచి నేటి వరకు..

యువతకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో 1948లో ఏర్పాటైన ఈ కళాశాలకు.. 1952లో అప్పటి ముఖ్యమంత్రి సర్ సి.వి.రాజగోపాలాచారి చేతుల మీదుగా పునాదిరాయి పడింది. నేడు అదే ప్రాంతంలో ఆకట్టుకునే భవన నిర్మాణాలతో ఆర్ట్స్ కళాశాలగా రూపుదిద్దుకొంది. ఎందరో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన చదువుల కోవెల మరో మైలురాయికి చేరువలో నిలిచింది. మద్రాసు ప్రభుత్వంలో 1948లో ఏర్పాటైన ఈ విద్యాలయం దాదాపు 75 సంవత్సరాల పాటు రాయలసీమ ప్రాంత ప్రజలకు విద్యా సుగంధాలు వెదజల్లుతూనే ఉంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం అనుబంధంతో ఏర్పాటైన ప్రభుత్వ పురుషుల కళాశాల ఆర్ట్స్ కళాశాలగా ప్రారంభమైంది. అనంతరం 1968లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి, 2008లో కడప యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉంది. 2012-13లో స్వయంప్రతిపత్తి సాధించి అటానమస్ హోదాతో యేటా దాదాపు 2వేల మందికిపైగా విద్యార్థులకు సేవలందిస్తోంది.

ప్రత్యేక నిధులు..

స్టార్ కళాశాల ప్రోగ్రాం కింద ఎంపికైన కళాశాలలకు డీబీటీ వారు యేడాదికి రూ.1 కోటి చొప్పున నిధులను కేటాయిస్తారు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాలకు సంబంధించి ఒక్కో విభాగానికి రూ.15 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తారు. పరిశోధన, మౌలిక సదుపాయాలు, టూర్స్, ప్రాజెక్టులు, సెమినార్లు, కాన్ఫరెన్స్‌ల నిర్వహణ అంశాలకు నిధులను వినియోగించుకునే సౌకర్యం కల్పిస్తారు. ఇలా మూడేళ్ల పాటు యేడాదికి రూ.1 కోటి చొప్పున నిధులను విడుదల చేస్తారు. అనంతరం రెండో సైకిల్‌లో ఇదే ప్రగతి కొనసాగితే 'స్టార్ కళాశాల' హోదా ఇవ్వనున్నట్లు కళాశాల అధ్యాపక బృందం తెలిపింది. కళాశాల స్టార్ కళాశాల ప్రోగ్రాంకు ఎంపికవడంపై ప్రిన్సిపాల్ డా.జి.రవీంద్రనాథ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వై.సావిత్రి సంతోషం వ్యక్తం చేశారు.

గర్భిణుల మోముల్లో చిరునవ్వు కోసమే సీమంతం

రాజంపేట టౌన్ : గర్భిణులకు సీమంతం కార్యక్రమం ఓ తీపి జ్ఞాపకమని.. పేద, మధ్యతరగతి గర్భిణుల మోముల్లో చిరునవ్వు చూడడం కోసం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా ఈనెల 20న ఆకేపాటి ఎస్టేట్‌లో సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు, పుల్లంపేట మండలాలకు చెందిన వందలాది మంది గర్భిణులకు తాను ఓ అన్ననై సీమంతం కార్యక్రమం చేపడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సీమంతం కార్యక్రమం సందర్భంగా అంకుర కార్పొరేట్ హాస్పిటల్ యాజమాన్యం గర్భిణీలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ సౌమిత్రి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య, దండు గోపి, జీవీ.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం



జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గుండ్లకుంట శ్రీరాములు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాములు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరాములు మాట్లాడుతూ కష్టపడిన వారికి కాంగ్రెస్ పార్టీ పదవులనిచ్చి గౌరవిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. నజీర్ అహ్మద్, విష్ణు ప్రీతం రెడ్డి, అహ్మద్ ఆలీఖాన్, ప్రభాకర్, చార్లెస్, శ్రీనివాసులు రెడ్డి, చెప్పలి పుల్లయ్య, తిరుమలేష్, తదితరులు, పాల్గొన్నారు.

కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గణేష్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామ సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానం కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఈ-ఆఫీస్ అమలు, నిర్వహణపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ-ఆఫీస్ సిస్టమ్ ఆచరణలో ఉండగా అన్ని శాఖల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఆచరణ పెట్టని శాఖలు వెంటనే మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి ప్రాధాన్యం



బిల్డింగ్ నిర్మాణ పత్రాన్ని సభ్యులకు అందిస్తున్న మల్లెల ఝాన్సీరాణి, తదితరులు

బ్రహ్మంగారిమఠం : సహకార సంఘాలు బలోపేతం చెందాలంటే రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని కడప డీసీసీ బ్యాంక్, రాష్ట్ర ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. బి.మఠం తహసీల్దారు కార్యాలయం ఆవరణలోని రూ.24 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన నూతన భవనం నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. అనంతరం సోమిరెడ్డిపల్లె సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకార పరపతి సంఘాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీ బ్యాంకు పనితీరు ఎలా ఉందో నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి పంపామన్నారు. మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి సైతం సహకార పరపతి సంఘాలు స్వయంగా అభివృద్ధి చెందాలని తెలిపారన్నారు. ఇందుకు రైతులకు ఇచ్చిన రుణాల సేకరణపై పలు సలహాలిచ్చారన్నారు. సహకార సంఘాల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వలేని ఇబ్బందులలో కొన్ని సంఘాలు ఉన్నాయన్నారు. నాబార్డు జిల్లా డీడీఎం విజయవిహారి మాట్లాడుతూ నాబార్డు ద్వారా సహకార సంఘాలకు నిధులు విడుదల చేస్తున్నామన్నారు. రైతులు, వ్యాపార తదితర వర్గాలకు రుణాలు ఇవ్వాలన్నారు. కడప డీసీసీ బ్యాంక్ సీఈఓ కె.రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సహకార పరపతి సంఘాలలో డిపాజిట్ల సేకరణకు సంఘం సభ్యులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. సహదేవరెడ్డి, మల్లేల రాజారామిరెడ్డి, కళావతి, ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అన్నపూర్ణ రూపం.. భక్తజన పరవశం

శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం మూడో రోజున వైభవోపేతంగా జరిగాయి. ప్రొద్దుటూరు కన్యకా పరమేశ్వరీ ఆలయం లో మంగళవారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. సకల జీవులకు అన్నం పరబ్రహ్మస్వరూపం.. అన్నం లేనిదే జీవుని మనుగడ లేదు. మాతా.. అన్నపూర్ణేశ్వరీ అంటూ వేద పండితులు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారిని అలంకరించారు. వివిధ రకాల ఆహార పదార్థాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు పోటెత్తడంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి ఆలయాల సమీప వీధులు జనసంద్రాలయ్యాయి. -ప్రొద్దుటూరు కల్చరల్





ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అమ్మవారికి సమర్పించిన వివిధ రకాల పిండి వంటలు (ఇన్‌సెట్) అన్నపూర్ణాదేవి, భారీ ఎత్తున క్యూలైన్‌లో బారులు తీరిన భక్తజనం

క్లుప్తంగా

గొలుసు కోసం చెల్లెలి హత్య



మృతిచెందిన మిలాన్ కుమారి

పులివెందుల రూరల్: తల్లిదండ్రులు తీసుకొచ్చిన బంగారు గొలుసు మెడలో వేసుకున్న నేరానికి చెల్లెలు అన్న చేతిలో హతమైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏడాది క్రితం బీహార్ రాష్ట్రానికి చెందిన బసంత్ పాశ్వన్, కిరణ్‌దేవి దంపతులు ఏడాది క్రితం పులివెందుల శివార్లలో ఉన్న ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో పనిచేసేందుకు వచ్చారు. రోజు మాదిరిగానే తల్లిదండ్రులు ఇద్దరు మంగళవారం ఎస్ఎస్ఎల్ కర్మాగారంలో పనిచేసేందుకు వెళ్లారు. వారి కుమారుడు రాజీవ్ పాశ్వన్(21), కుమార్తె మిలాన్ కుమారి(14) క్వార్టర్స్‌లోని వారి ఇంటి వద్దే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల తల్లిదండ్రులు రాజీవ్ పాశ్వన్ కోసం చేయించిన బంగారు గొలుసును చెల్లెలు మిలాన్‌కుమారి వేసుకుంది. దీంతో తన గొలుసు నీవెందుకు వేసుకున్నావంటూ అన్న గొడవపడ్డాడు. ఈ పరిస్థితిలో మెడలోని గొలుసును బలంగా లాగడంతో ఆమె ఊపిరాడక మృతి చెందింది. తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు భావించారు. ఆ తర్వాత అన్నను విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అన్నపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హుసేన్ తెలిపారు.

కానిస్టేబుళ్లకు రివార్డులు



కానిస్టేబుళ్లకు నగదు రివార్డును అందజేస్తున్న సీఐ రమణారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఐదేళ్ల నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుళ్లకు రూరల్ సీఐ రమణారెడ్డి రివార్డు అందజేశారు. మండల పరిధిలోని మీనాపురం గ్రామానికి చెందిన గిడ్డంగి రసూల్ ఒక కేసుకు సంబంధించి ఐదేళ్ల నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో నెల్లూరులో ఉన్న రసూల్‌ను మంగళవారం రూరల్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డిలు అదుపులోకి తీసుకొని ప్రొద్దుటూరు కోర్టులో హాజరు పరిచారు. లాంగ్ పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్‌ను ఎగ్జిక్యూట్ చేసినందుకు సీఐ రమణారెడ్డి ఇరువురు కానిస్టేబుళ్లకు నగదు రివార్డును అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

చోరీ కేసులో రెండేళ్లు జైలుశిక్ష

రాజంపేట : ఈ యేడాది ఏప్రిల్ 29న రాజంపేట పట్టణంలోని మోహర్‌బాబా నగర్‌లో బొజ్జిరెడి అశోక్‌రెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. ఈ కేసులో ఎస్వీనగర్‌కు చెందిన బాలిపోగు ఇజ్రాయిల్‌కు రెండేళ్లు జైలుశిక్ష విధిస్తూ రాజంపేట మొదటి తరగతి కోర్టు ఇన్‌చార్జి జడ్జి లత తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని పట్టణ సీఐ నరసింహారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. చోరీకి సంబంధించి మార్చి 15న ముద్దాయిని అరెస్టు చేసి, 88 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. ముద్దాయిని జైలుకు తరలించి, చార్జిషీటు దాఖలు చేశామన్నారు. ముద్దాయిపై నేరారోపణ రుజువు కావడంతో రెండేళ్లు జైలు శిక్ష విధించారన్నారు.

చిత్తూరు జట్టు విజయం



మహేంద్రారెడ్డి, అనంతపురం (131 పరుగులు)



రోహిత్‌రోషన్, అనంతపురం (108 పరుగులు)



యోగానంద, అనంతపురం (81 పరుగులు)



పన్నీర్‌సెల్వం, చిత్తూరు (96 పరుగులు)



నారాయణ, నెల్లూరు (4 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు విజయం సాధించింది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 136 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 63.2 ఓవర్లలో 239 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పన్నీర్‌సెల్వం 96 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు నారాయణ 4, సుబ్రమణ్యం 2, అజిత్‌బాబు 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 34.4 ఓవర్లలో 102 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నారాయణ 22 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు సూర్యచరణ్ 4 వికెట్లు, మల్లేశన్ 3, దీపన్‌సాయినాథ్ 3 వికెట్లు చొప్పున తీశారు. దీంతో చిత్తూరు జట్టు 9 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 219 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 347 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

మ్యాచ్ డ్రా.. కర్నూలుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన కర్నూలు, అనంతపురం మ్యాచ్ డ్రాగా ముగిసింది. మూడోరోజు మంగళవారం 424 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు మరో 14 పరుగులు చేసి 106.3 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 438 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని మహేంద్రయాదవ్ 201, మనోజ్‌రాజు 146 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు కమిల్ 3, లోహిత్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 83 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ రోషన్ 108 పరుగులు, మహేంద్రారెడ్డి 131 పరుగులు, యోగానంద 81 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్ ఇస్మాయిల్ 2 వికెట్లు తీశాడు. కాగా అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కర్నూలు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

సంతోష్‌ట్రోఫీకి కడప కుర్రాడు

కూలీ బిడ్డకు దక్కిన అవకాశం



సయ్యద్ ముక్తార్

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు సయ్యద్ ముక్తార్‌కు ఫుట్‌బాల్ క్రీడలో ప్రతిష్టాత్మకంగా భావించే సంతోష్‌ట్రోఫీలో పాల్గొనే అవకాశం లభించింది. ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు మహారాష్ట్రలోని కోలాపూర్‌లో నిర్వహిస్తున్న ఆలిండియా ఫుట్‌బాల్ మీట్ సంతోష్ ట్రోఫీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. కడప నగరంలోని యంగ్‌మెన్ ఫుట్‌బాల్ క్లబ్ తరపున శిక్షణ పొందుతూ ఏపీ జట్టు ఎంపికల్లో పాల్గొన్నాడు. ఈనెల 1 నుంచి 12వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో ఈయన ప్రతిభ కనబరచడంతో సంతోష్‌ట్రోఫీలో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేశారు.

పనిచేసుకుంటూ సాధనకు..

సయ్యద్ ముక్తార్ కడప నగరంలోని ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేసుకుంటూ ఫుట్‌బాల్ క్రీడ సాధన చేస్తున్నాడు. తల్లిదండ్రులు ఇరువురూ కూలిపనులు చేసుకుంటూ ఈయనను పోషించగా, ఈయన కూడా బేల్దారి పనులకు వెళ్తూ కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ఇదే సమయంలో అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే వైవీయూ జట్టుకు మూడుసార్లు ప్రాతినిధ్యం వహించాడు. ఓవైపు పనిచేసుకుంటూ మరోవైపు ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న ముక్తార్‌కు వైఎస్ఆర్ కడప జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అండగా నిలుస్తోంది. జిల్లా క్రీడాకారులు సంతోష్‌ట్రోఫీకి ఎంపికవడం పట్ల జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎం. డానియల్ ప్రదీప్, కార్యదర్శి ఎం. సుధీర్‌శ్రీ సంతోషం వ్యక్తం చేశారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధికి కృషి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఏపీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం కడపలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ ఆధ్వర్యంలో ఏరియా కో ఆర్డినేటర్లు, డీపీఎంసీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలన్నారు. డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు డ్వాక్రా సంఘాల ద్వారా సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయించి వారి ఆర్థిక రాబడికి తోడ్పాటును అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్లు, డీపీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌ను అరికట్టాలి

ఆన్‌లైన్ గేమ్స్‌ను అరికట్టి యువత ప్రాణాలను నిలపాలని ఎస్పీ సిద్దార్థ కౌశల్‌ను ఏపీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. జిల్లా ఎస్పీని మంగళవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. యువత ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలై లక్షలాది రూపాయలను పోగొట్టుకుంటున్నారన్నారు. దీంతో వారు అప్పులు చేసి ఎవరికి చెప్పలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు.

అత్తవారింటి ముందు మహిళ బైఠాయింపు

ప్రొద్దుటూరు క్రైం : తనకు భర్త, కుమారుడు కావాలంటూ ఒక మహిళ అత్తవారింటి ముందు బైఠాయించిన సంఘటన ప్రొద్దుటూరు మండలం బొజ్జవారిపల్లెలో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.. మైదుకూరుకు చెందిన అస్మాసుల్తానాకు నాలుగున్నర ఏళ్ల క్రితం బొజ్జవారిపల్లెకు చెందిన కిరణ్‌బాషాతో వివాహమైంది. భార్యాభర్తలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. పెళ్లైన తర్వాత ఆమె భర్తతో పాటు బ్రునై దేశానికి వెళ్లి 2019 డిసెంబర్‌లో తిరిగి వచ్చి బొజ్జవారిపల్లెలో ఉంటున్నారు. కరోనా కారణంగా భర్త వర్క్‌ఫ్రం హోం చేస్తూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో మనస్పర్థలు రావడంతో కొన్ని నెలల నుంచి ఆమె మైదుకూరులోని అమ్మగారింట్లో ఉంటోంది. కుమారుడు మాత్రం తండ్రి వద్దనే ఉంటున్నాడు. తనను కాపురానికి తీసుకెళ్లాలని మంగళవారం అత్తవారింటి ముందు బైఠాయించింది. విషయం తెలిసిన ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు ఇరువురితో మాట్లాడారు. వారం తర్వాత ప్రొద్దుటూరులో కాపురం పెడతామని కిరణ్‌బాషా కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందుకు అంగీకరించిన అస్మాసుల్తాన భర్తతో కలసి అత్తవారింటికి వెళ్లడంతో కథ సుఖాంతమైంది.

వస్త్ర దుకాణంలో సేల్స్‌ట్యాక్స్ అధికారుల తనిఖీ



వస్త్ర దుకాణంలో తనిఖీలు నిర్వహించి వస్తున్న సేల్స్‌ట్యాక్స్ అధికారులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణం తాడిపత్రి రహదారిలో ఉన్న వస్త్ర దుకాణంపై సేల్స్ ట్యాక్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 20 మంది అధికారులు దాడుల్లో పాల్గొన్నారు. దుకాణంలో ప్రస్తుతం ఉన్న స్టాక్, బిల్లులను వారు పరిశీలించారు. దుకాణంలో ఉన్న దాదాపు 6 సంవత్సరాల పాత రికార్డులను కొన్నింటిని వారి వెంట తీసుకుని వెళ్లారు. అధికారులు పిలిచినప్పుడు తప్పనిసరిగా రావాలని వారు యజమానికి సూచించారు. అనంతరం రాయచోటి అసిస్టెంట్ కమిషనర్ నూర్జహాన్ విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణంపై దాడి నిర్వహించామన్నారు. కాగా వస్త్ర దుకాణంపై సేల్స్ ట్యాక్స్ అధికారులు దాడులు నిర్వహించారని విషయాన్ని తెలుసుకున్న కొంతమంది వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు.

ఇంటిపై నుంచి కిందపడి బేల్దారి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని రాం నగర్‌లో మంగళవారం ఇంటి పై నుంచి కింద పడడంతో బేల్దారి గాండ్లపాటి పుష్పరాజు (38) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కమలాపురం పట్టణంలోని రాం నగర్‌లో నివాసముంటున్న అవివాహితుడైన గాండ్లపాటి పుష్పరాజు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నిత్యం లాగే మంగళవారం రాంనగర్ కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ నిర్మాణంలో ఉన్న భవనంపైన పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి బేల్దార్లు, కూలీలు చికిత్స కోసం అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పుష్పరాజుకు మూర్ఛ వ్యాధి ఉందని, పని చేసే సమయంలో మూర్ఛ రావడం వలన కింద పడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ గొడవకు దిగిన కుటుంబీకులు

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ప్రసూతి వార్డులో చికిత్స పొందుతూ బాలింత మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ బోయమాలపల్లెకు చెందిన ఆనంద్ భార్య నాగవేణి(24) తొలికాన్పు కోసం ఈనెల 10న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేరింది. కాన్పు కష్టం కావడంతో ఈనెల 11న సిజేరియన్ ఆపరేషన్ ద్వారా వైద్యులు చికిత్స అందించగా, మగబిడ్డను ప్రసవించింది. అప్పటి నుంచీ ప్రసూతివార్డులో ఆమె చికిత్స పొందుతోంది. సోమవారం రాత్రి 11గంటల సమయంలో ఆస్పత్రిలోని బెడ్‌పైనే ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారకస్థితికి చేరుకుంది. విధుల్లో ఉన్న నర్సింగ్ సిబ్బంది వైద్యులకు సమాచారం అందించగా గైనిక్ వైద్యురాలు ఉమాదేవి వచ్చి ఆమెను పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో నాగవేణి బంధువులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. రాత్రి భోజనం తిని పడుకున్న తమ బిడ్డ ఎలా మృతి చెందిందంటూ డాక్టర్లు, సిబ్బందిని నిలదీశారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే నాగవేణి మృతి చెందిందంటూ గొడవకు దిగారు. రాత్రివేళల్లో బాలింతలకు సరైన చికిత్స అందించడం లేదని ఆరోపించారు. ఆస్పత్రి సిబ్బందిపై కుటుంబీకులు గొడవకు దిగిన సమాచారాన్ని తెలుసుకున్న అవుట్‌పోస్ట్ ఏఎస్ఐ గణపతి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులతో కలిసి వార్డులోకి వెళ్లి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న ఆర్ఎంఓ డాక్టర్ ప్రసాదరాజు మృతురాలి కుటుంబీకులతో మాట్లాడి వైద్యచికిత్స అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో తెల్లవారుజామున నాగవేణి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు. తమ బిడ్డ మృతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోకుంటే ఆందోళనకు దిగుతామని మృతురాలి కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఆర్ఎంఓ ప్రసాద్‌రాజు బాలింత మృతిపై వివరణ ఇస్తూ.. నాగవేణి రెండురోజులుగా జ్వరంతో బాధపడుతోందని, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడంతో గైనిక్ డాక్టర్ ఉమాదేవి, ఫిజీషియన్ మోహిని వైద్యసేవలు అందించారన్నారు. రక్తకణాల సంఖ్య తగ్గిన కారణంగా పలమనరీ ఎంబాలసీతో మృతి చెందినట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగిస్తున్న ఎస్ఐ భాస్కర్

ప్రొద్దుటూరు క్రైం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చెన్నకేశవస్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి తప్పిపోయి ఏడుస్తున్న ఆరేళ్ల రయాన్ అనే బాలుడిని పోలీసులు గుర్తించారు. ట్రాఫిక్ సీఐ యుగంధర్, ఎస్ఐ భాస్కర్ బాలుడిని కొద్దిసేపు తమ సంరక్షణలో ఉంచుకొని తర్వాత తల్లిదండ్రులకు అప్పగించారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలి



వంద అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ దేశ స్వాతంత్య్ర సమర యోధులను స్మరించుకోవాలని రాజంపేట కోర్టు అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజిలో నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నా దేశం నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. 100 అడుగుల జాతీయ జెండాను విద్యార్థులు నరసింహాపురం గ్రామం వరకు ర్యాలీగా తీసుకెళ్లి అక్కడ కలశాలలో మట్టిని సేకరించారు. దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో మహనీయులు వారి ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీలోని అమృత్వాటిక స్మృతి వనంలో ఏర్పాటు చేస్తారన్నారు. ఈనెల 31న ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రతి మండలం నుంచి ముగ్గురు సభ్యులు ఢిల్లీకి వెళతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామ్మోహన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ సిద్దార్థ్, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలు

ఒంగోలు : సీబీఎస్ఈ సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలు మంగళవారం నగరంలోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల్లోని సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 12 వ్యక్తిగత విభాగాలు, 12 టీం ఈవెంట్లుగా రైఫిల్, పిస్టల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన వారు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు సౌత్‌జోన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా బహూకరించారు.

పిస్టల్ షూటింగ్ విజేతల వివరాలు:

అండర్ 14 బాలికలు : యుక్త బి(తిరుచ్చి), జై రక్షయ ఆర్ (కడలూర్), సుబ్రతాదేవి (కోయంబత్తూరు), జి.లోకజ్ఞ (కడప)

అండర్ 17 బాలికలు : పుల్లగూర మనస్విని (కడప), ఎల్.మిషిత శ్రీ (అన్నానగర్), సంజన ఆర్ (పుదుచ్చేరి), వర్షిణి ఎ (చెన్నై), నిట్టిష (చెన్నై)

ఇసుక ట్రాక్టర్ సీజ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు కడప ఎస్ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఎవరైనా టిప్పర్ల ద్వారా తోలుకొని ట్రాక్టర్ల ద్వారా అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పాము కాటుతో అస్వస్థత

మదనపల్లె : పాము కాటుకు గురైన వ్యక్తి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుర్రంకొండ మండలం రామాపురం పంచాయతీ దిగువబురుజుపల్లెకు చెందిన జె.వేణు(26) ఉదయం పొలాల వద్దకు బహిర్భూమికి వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

కుల ధ్రువీకరణపత్రం.. ఇక శాశ్వతం

- కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు ఒక్కసారి పొందితే చాలు
- ఒరిజినల్ పోయినా అదే నంబరుపై కొత్త సర్టిఫికెట్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



జగనన్న సురక్షలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు విద్య, ఉద్యోగం తదితర అవసరాలకు కుల ధ్రువీకరణ పత్రాలు చాలా కీలకంగా మారాయి. అయితే వీటి జారీలో ఇప్పటివరకు అనేక నిబంధనల కారణంగా ఆయా వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. అయితే ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, ఆదాయ, నివాస, ధ్రువీకరణపత్రాల జారీలో అనేక సడలింపులను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఇప్పటికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి అర్హులైన వారందరికీ ఇంటి ముంగిటకే ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అంతటితో ఆగకుండా మరోసారి కుల ధ్రువీకరణ పత్రాన్ని ఒకసారి పొందితే దానిని శాశ్వత పత్రంగా పరిగణించాలని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

ఒరిజినల్ పోతే అదే నంబరుతో కొత్త సర్టిఫికెట్

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విషయంలో ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. ఈ క్రమంలో కుల ధ్రువీకరణ పత్రాన్ని ఒక్కసారి పొందితే చాలు దాన్ని శాశ్వత పత్రంగా పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ప్రజలు పొందిన సర్టిఫికెట్ ఎక్కడైనా పోగొట్టుకుంటే దానికోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఇందుకు సంబంధించి గతంలో పొందిన సర్టిఫికెట్ నకలు ఉంటే దానిని తీసుకెళ్లి సచివాలయం, మీసేవా కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లలో చూపితే దాని ద్వారా అదే నంబరుతో కొత్త సర్టిఫికెట్‌ను వెంటనే అందజేస్తారు. ఇందుకోసం కొత్తగా ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. కుటుంబంలో ఎవరు ఎలాంటి సర్టిఫికెట్ పొంది ఉండకపోతే దరఖాస్తుదారుడు ప్రస్తుతం ఈకేవైసీ చేయించుకుని తహసీల్దార్ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుంది. ఒకవేళ దరఖాస్తుదారుడు ఈకేవైసీ చేయించుకుని సర్టిఫికెట్ పొంది ఉంటే అతని రక్తసంబంధీకులు ఎవరైనా ఎలాంటి వెరిఫికేషన్ లేకుండా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చు.

జగనన్న సురక్షలో లక్షలాది సర్టిఫికెట్లు

గత జూన్, జులై నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో గుర్తించి వాటిని గ్రామ సభల్లో అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 3,19,975 కుటుంబాలను సర్వే చేసి 2,86,169 కుటుంబాలకు సర్టిఫికెట్లను అందజేశారు. అత్యధికంగా కుల, ఆదాయ, నివాసాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై ఈ సర్టిఫికెట్లన్నీ శాశ్వత సర్టిఫికెట్లుగా గుర్తించనున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

ఒక్కసారి తీసుకుంటే చాలు



ఎవరైనా కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను ఒక్కసారి పొందితే చాలు.. వాటిని శాశ్వత ధ్రువీకరణ పత్రాలుగా పరిగణిస్తాం. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు జారీ చేశాం. మా పరిధిలో 71,721 సర్టిఫికెట్లను అందజేశాము. వివిధ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకుంటే అర్హతలను పరిశీలించి సర్టిఫికెట్ల జారీకి తగిన చర్యలు చేపడతాం.

– శివరామిరెడ్డి, తహసీల్దార్, కడప